


# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక 20-2-2001 (5)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

## సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహ భాషణములు

| | |
|---|---|
| 21-02-2001<br>బుధవారం | చించినాడ (మహా శివరాత్రి) |
| 25-02-2001<br>ఆదివారం | సామర్లకోట<br>టి.టి.డి కళ్యాణ మండపం, రైల్వే స్టేషన్ ఎదురుగా |
| 28-02-2001<br>బుధవారం | గోడిపాలెం (అమలాపురం దగ్గర) |
| 04-03-2001<br>ఆదివారం | నరసాపురం, పార్కు రోడ్డు చెట్లు వద్ద<br>చిల్డ్రన్ స్పెషలిస్ట్ రాజుగారి హాస్పటల్ వద్ద |
| 05-03-2001<br>సోమవారం | గుమ్మలూరు<br>సాయిబాబా ఆలయం |
| 07-03-2001<br>బుధవారం | ఆత్రేయపురం<br>(వయా) రావులపాలెం, తూ॥గో॥ జిల్లా |
| 08-03-2001<br>గురువారం | చించినాడ - గీతా మందిరం |
| 09 నుండి 15-03-2001 | అరుణాచలం క్యాంప్ |
| 30-03-2001<br>శుక్రవారం | జిన్నూరు - శ్రీ రమణ క్షేత్రం |

## పాలకొల్లులో శ్రీ దత్తసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

పాలకొల్లు శంభన్న అగ్రహారంలో ది. 12-02-2001 సోమవారం వేదపండితుల దివ్య వేద ప్రవచనాలతో మంగళవాయిద్యాలతో వారణాసి సత్యనారాయణ దంపతులచే విఘ్నేశ్వర, శ్రీదత్తాత్రేయ స్వామి వార్లతోసహా శ్రీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ ఎంతో వైభవంగా జరిగింది.

శ్రీమతి పెన్మెత్స సూర్య పద్మావతి సాయిబాబా విగ్రహాన్ని, దత్తాత్రేయ విగ్రహాన్ని ఎస్.ఎస్.వి. విశ్వనాధ స్వామీజీ, గణపతి విగ్రహాన్ని బుద్దరాజు వెంకటేశ్వరరాజు తయారుచేయించి ఈ ఆలయానికి ఇచ్చారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం ఆగమనశాస్త్ర పండితుడు దేవులపల్లి రామశాస్త్రి, దేవులపల్లి కృష్ణమూర్తి, దేవరకొండ వేంకట సుబ్రహ్మణ్యంగారి పర్యవేక్షణలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయ కమిటీ కోశాధికారి సోమంచి సత్యనారాయణ మూర్తి, ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ, సద్గురు శ్రీ నాన్నగారు, మున్సిపల్ చైర్మన్ శిడగం పాపారావు, జడ్.పి. వైస్ చైర్మన్ అంగర రామమోహన్, కలగ శంభుప్రసాద్, పట్టణ ప్రముఖులు, వేలాదిమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 5 పుష్యం : 14-16 20-2-2001

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL: 6 ISSUE: 5**

EDITOR
**P. S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 24278


## అష్టావక్రుడు - జనకుడు

అది జనక మహారాజు కొలువు. అచ్చట వేదాంత గోష్ఠి జరుగుతున్నది. జనక మహారాజు అడిగిన ఒక ప్రశ్నకు పండితులెవరూ సమాధానం చెప్పలేక తికమక పడుతున్నారు. అష్టావక్రుని తండ్రికూడా ఆ గోష్ఠిలో ఉన్నాడు. తన తండ్రిని ఇంటికి ఒక పనిమీద తీసుకొని వెళ్ళుటకు అష్టావక్రుడు జనకుని కొలువులోనికి వెళ్ళినాడు. జనక మహారాజు ప్రశ్నను తెలుసుకొని తాను దానికి జవాబు చెప్పగలనని అన్నాడు. అష్టావక్రుడు అలా అనగానే పండితులంతా అతనివంక చూచి, నీవాలకానికి అదొక్కటే తక్కువయిందని బిగ్గరగా నవ్వారు. అప్పుడు అష్టావక్రుడు అతి బిగ్గరగా నవ్వాడు. అందరూ బిత్తరపోయి చూస్తున్నారు. జనకుడు అష్టావక్రుని వంకచూసి మీరు ఎవరిని ఉద్దేశించి బిగ్గరగా నవ్వారు అని అడిగారు. అపుడు అష్టావక్రుడు ఇలా సమాధానం ఇచ్చాడు. మహారాజా, మీ కొలువులో ఉన్నవారికి పాండిత్యం మాత్రమే ఉంది, దేహబుద్ధి ఎక్కువగా ఉన్నమూలాన అష్టవంకరలుగా ఉన్న నా దేహాన్ని చూచి, అది నా స్వరూపము అనుకొంటున్నారు. వారి పరిస్థితికి జాలిపడి నవ్వాను అన్నారు. అయితే గోష్ఠిలో సమస్యకు సమాధానం చెప్పగలరా అని జనకుడు అష్టావక్రుని అడిగారు. సమాధానం చెప్పటమే కాదు, మీ స్వరూపాన్ని మీ ఎఱుకలో ఉండేలా చేయగలను అన్నారు. మరి నేను మహారాజును కదా, నాకు అనేక వ్యవహారాలు చూసే బాధ్యత ఉన్నది, అందువల్ల మీరు నాకు గుర్రం మీద నేనుకాలు మోపి ఎక్కేలోగా నాకు ఆత్మజ్ఞానం కలిగించాలి అని అన్నారు. అష్టావక్రుడు అట్లే కానివ్వండి అన్నారు. జనకుడు గుర్రం మీద కాలువేసిన ఉదుటనే స్థాణువులా ఉండిపోయి, సమాధిస్థితిని పొందాడు. తిరిగి శరీర స్పృహ వచ్చిన తరువాత ఆత్మ వస్తువు గురించి వినయ, వైరాగ్యములనే సంపదలున్న జనకునికి వివరముగా బోధించినారు. అట్టిది అష్టావక్రుని వైభవము. ఆయన జనకునికి ఆత్మవస్తువు గురించి చేసిన జ్ఞానబోధే అష్టావక్ర గీత.

### ఈ సంచికలో............

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు


10-11-2000 ఉండి ........ 2

29-01-2001 నరసాపురం ........ 10

05-02-2001 చించినాడ ........ 14

# చదువుకన్నా, ధనంకన్నా - పవిత్రత, శీలం గొప్పవి

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-11-2000, ఉండి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనస్సు చాలా బలీయమైనది. అది విజృంభించినప్పుడు దాని బలం ఎంత ఉందో మనకు తెలుస్తుంది. మనస్సును సూక్ష్మం చేసుకోండి. సూక్ష్మమైన మనస్సుకు సూక్ష్మవిషయాలు అర్థమవుతాయి. మనస్సుయొక్క ప్రభావము శరీరం మీద ఉంటుంది ఎందుచేతనంటే ఈ శరీరం కూడా మనస్సుదే. నీ శరీరానికి వచ్చిన రోగాన్ని కాని, మనస్సులో ఉన్న బలహీనతనుగాని ముందు అంగీకరించు, తరువాత తొలగించుకోవటానికి ప్రయత్నంచెయ్యి. వాటిని ముందు అంగీకరించవనుకో వెంటనే నీకు దుఃఖం వచ్చేస్తుంది. నా శరీరంలో ఈ రోగం ఉంది, నా మనస్సులో ఈ లోపం ఉంది అని మీలోమీరు అంగీకరించటం వలన ముందు రియాక్షన్, కోపం, దుఃఖం తగ్గిపోతాయి. ప్రతీజీవుడిని మసిచేసి పాడుచేసేవి ఇవి రెండే. ఒకటి కోపం, రెండు కోరిక. ఇష్టం, అయిష్టంల నుండి విడుదల పొందమని చెపుతున్నారు ఎందుచేత విడుదల పొందాలి అంటే ఇష్టం, అయిష్టం ఉన్నా మన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనస్సు బాహ్యానికి వెళుతూ ఉంటే స్థూలం అవుతుంది, లోపలకు వెళుతూ ఉంటే సూక్ష్మం అవుతుంది. మనస్సు బాహ్యానికి వెళుతూ ఉంటే రూపాలు, నామాలు, విషయాలు కనిపిస్తాయి, పెద్ద సున్నతో సమానమైన లోకం కనిపిస్తుంది. అందరూ ఈ లోకంచుట్టూ తిరుగుతూ ఉంటారు. సాధనచేస్తున్నా మనం అభివృద్ధిలోనికి రాకపోవటానికి కారణం ఈలోకం సున్నా అని మనకు తెలియటంలేదు. లోకంలో ఏదో ఉంది అని అనుకొంటున్నాము. అసలుబంగారం లోపల ఉంది అని మనకు తెలియటంలేదు. ఏదోకాసేపు ధ్యానంచేసి, జపం చేసి మనస్సును నిలబెట్టినా పూజగదిలో నుండి బయటకురాగానే లోకంలోనికి వెళ్ళిపోతుంది. లోకం అంతా బంగారంలాగ కనిపిస్తూ ఉంటే దానిని ఎవడు ఆపుచేయగలడు. మీ అబ్బాయికి రోజూ మాంసం, చేపలు, లడ్డూలు పెడుతూవాడిని చిక్కిపో అంటే చిక్కిపోతాడా అలాగే మనస్సు బాహ్యముఖం అవుతూఉంటే నామాలు, రూపాలు, స్నేహితులు, విరోధులు, విషయాలు అన్నీ కనిపిస్తాయి. అదే దానికి ఆహారం అందుచేత అది సూక్ష్మం అవ్వనే అవ్వదు. అందువలన మనస్సును లోపలకు ఉపసంహరించమని చెపుతున్నారు. మనస్సు లోపలకు వెళ్ళేకొలది అది సూక్ష్మం అవుతుంది.

వారు మా గురించి ఏమనుకొంటున్నారు, వీరు మా గురించి ఏమనుకొంటున్నారు అని ఇటువంటి గొడవలలోనికి వెళ్ళకండి. మీ మనస్సును మీరు మిత్రుడుగాచేసుకోండి, నిజమైన బంధువుగా చేసుకోండి. మీ మనస్సే మిమ్మల్ని బాగుచేస్తుంది, ఇతరులు బాగుచేయలేరు. మీ మనస్సు మీకు విరోధంగా ఉంటే ఇతరులు అందరూ స్నేహితులుగా ఉన్నా మిమ్మల్ని ఉద్ధరించలేరు. లక్షలాది జన్మలనుండి మీ మనస్సు కళ్ళద్వారా, చెవుల ద్వారా బయటకు వచ్చేస్తోంది. ఎవరైనా మిమ్మల్ని పొగిడితే మనస్సు సంతోషిస్తుంది, విమర్శిస్తే దుఃఖం వచ్చేస్తుంది. ఇంక దానికి దేవుడి గొడవ ఉండదు. అసలు నిజమైన ధనం, నిజమైన బంగారం భగవంతుని పాదాలే. ఆ పాదాలను ఆశ్రయించిన వాడి మనస్సు లోపలకు వెళుతుంది. ఇక్కడ ఇంతమంది భక్తులు ఉన్నారు. గుడికి వెళ్ళినప్పుడు సున్నతో సమానమైన ఈ లోకానికి సంబంధించిన విషయాలు అడిగేవారేగాని నా మనస్సును అంతర్ముఖం చెయ్యి, నా హృదయంలో ఉన్న దేవునిదగ్గరకు నా మనస్సును తీసుకొనివెళ్ళు అని ప్రార్థించే భక్తులు ఎవరు ఉన్నారు. చాలాకాలం నుండి మేము జపం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము అభివృద్ధి కనబడటంలేదు అని చాలామంది చెపుతూ ఉంటారు. కంగారు పడవద్దు మీరందరూ తరిస్తారు. మనస్సుకు బాహ్యానికి వెళ్ళిపోయే అలవాటు కొన్ని లక్షల సంవత్సరాల నుండి ఉంది. మన శరీరానికి 50 సం॥లు, 60 సం॥లు ఉంటుంది. ఇప్పుడు మనం చేసే ఈ సాధన సరిపోదు. ఎందుచేతనంటే లక్షల సంవత్సరాల నుండి మనస్సుకు ఉన్న అలవాటు తొందరగా ఒకేసారి పోదు. కాని మీరుచేసే ప్రయత్నం మానవద్దు, మీరుచేసే ప్రయత్నం వృధాపోదు. ఈశ్వరుని పాదాలయందు మనస్సును నిలబెట్టి ధ్యానంచేస్తూ ఉంటే, సాధన చేస్తూఉంటే మీ శక్తి వేస్టు అవుతోంది, కాలం వృధా అవుతోంది అనుకోవద్దు. ఫలితం రాలేదు అని కంగారు పడవద్దు. ఫలితం తప్పకవస్తుంది. అది ఎప్పుడు ఇవ్వాలో భగవంతుడు ఇస్తాడు. బ్యాంక్ లాకర్‌లో మీ బంగారం ఎలా దాచుకొంటున్నారో అలాగ ఇప్పుడు చెప్పే ఈమాటను మీ గుండెలో దాచుకోండి. దేవుడికి సంబంధించినపని అయినా, లోకానికి సంబంధించిన మంచిపని అయినా చేయండి, మర్చిపోండి. మీరు మర్చిపోయినా ఈశ్వరుడు మర్చిపోడు. దాని ఫలం ఎప్పుడు ఇవ్వాలో అప్పుడు ఇస్తాడు. పనిచేసి మర్చిపోవటం వలన రెండు లాభాలు. 1. ఫలితం వస్తుంది. అది ఎప్పుడు ఇవ్వాలో ఈశ్వరుడు ఇస్తాడు. 2. చిత్తశుద్ధి కలుగుతుంది. పనిచేసి మర్చిపోకపోతే ఫలం వస్తుంది కాని అజ్ఞానం, అవిద్య, దేహబుద్ధి పెరుగుతుంది. అంటే భగవదనుభవానికి అడ్డువచ్చే పెంట అంతా పెరిగిపోతుంది.

అందుచేత పనిచేసి మర్చిపోవటం నేర్చుకోవాలి. నీవుచేసినది ఈశ్వరుడు మర్చిపోడు. నిన్ను జ్ఞానంతో ఎప్పడు అలంకరించాలో అప్పడు అలంకరిస్తాడు. జ్ఞానులు, యోగులు గొప్ప ఆనందం అనుభవిస్తూఉంటారు. అది లౌకికమైన ఆనందం కాదు. అది అలౌకికమైనది, అభౌతికమైనది. ఆఆనందం ఇట్టిది అని ఎవరూ చెప్పలేము. జ్ఞాని ద్వారా పని జరుగుతున్నా, జరగకపోయినా అంతా ఆనందవే. అది ముగింపు లేని ఆనందం. మీరు ఆ ఆనందానుభవంలో ఉన్నప్పడు శరీరం మరణించినా ఆనందం కంటిన్యూ అయిపోతుంది. ఆ ఆనందం ఎవరోకాదు వాడే దేవుడు. ఆ ఆనందం రావాలంటే దైవీ సంపదను పెంచుకోండి అని చెపుతున్నారు.

నేలను దమ్ముచేసి మెత్తబడ్డాక ఊడిస్తే పంట బాగా పండుతుంది. ఎందుచేతనంటే పంట అభివృద్ధి అవ్వటానికి దమ్ము చేసిన భూమి సహకరిస్తుంది. దున్నకుండా ఊడిస్తే పంట పండదు. ఇక్కడ మీరు అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటి అంటే, మీ గుండెలో దాచుకోవలసిన విషయం ఏమిటి అంటే భగవంతుడు దైవీసంపదలో చెప్పిన మాటలు విసుగు లేకుండా శ్రవణం చేస్తూ ఉంటే, సహృదయం ఉన్నవారితో సహవాసం చేస్తూ ఉంటే మన మనస్సుకు దమ్ము అవుతుంది. మీకు దైవీసంపద లేదు అనుకోండి మనస్సును దమ్ముచేసుకోకుండా చాలాకాలం నుండి వింటున్నాము అంటే ఏమిటి ప్రయోజనం. నీ మనస్సు బంగారం అయితేకదా ఈశ్వరుడు నిన్ను జ్ఞానంతో అలంకరించేది. సహృదయం ఉన్నవారితో సహవాసం చేయటం వలన మనకు తెలియకుండా మనస్సుకు దమ్ము అవుతుంది. మనస్సును దమ్ముచేస్తే భగవంతుడు చెప్పినమాటలు నమ్ముతావు. నీకు సహృదయంలేదు అనుకో భగవంతుడు చెప్పిన మాటలు విన్నా ప్రయోజనం లేదు. అలాగని నిన్ను ఈశ్వరుడు విడిచిపెట్టేయటం లేదు. నీకు సహృదయం లేనప్పడు మనస్సును దమ్ము చేసుకోవటానికి సహృదయం, సద్బుద్ధి ఉన్నవారితో సహవాసం చెయ్యి అని చెపుతున్నాడు. అప్పడు నీ మనస్సుకు దమ్ము అవుతుంది. అప్పడు జ్ఞానులు చెప్పిన మాటలు శ్రవణం చేస్తూ ఉంటే ఆ మాటలు లోపల నాటుకొని అవి పెరిగి జ్ఞానం అనే పంటను, మోక్షం అనే ఫలాన్ని, నిర్వాణ సుఖాన్ని నీకు అందిస్తాయి. అందుచేత మన మనస్సు ఎలా ఉందో ముందు చూసుకోవాలి. మన మనస్సులో ఉన్న బలహీనతలను అంగీకరించి వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. దేహంలో ఉన్న పరిస్థితిని, మనస్సులో ఉన్న పరిస్థితిని ముందు అంగీకరించు. నీకు గుండె జబ్బు ఉంది అని డాక్టరు చెప్పాడు అనుకో కంగారు పడవద్దు. ముందు దానిని

అంగీకరించు తరువాత ఆ జబ్బును తొలగించుకొనే ప్రయత్నం చెయ్యి. మీ అత్తగారు మాట మాటకు ఉద్రేకపడుతున్నారు అనుకో. ఆవిడ స్వభావం అంతే అని నీకు అర్థమయితే వెంటనే మీకు దుఃఖం ఆగిపోతుంది. మనస్సు బాహ్యముఖానికి వెళితే నానా గొడవలు, అశాంతి వచ్చేస్తుంది. అందుచేత మనం గుడికి వెళ్లినప్పుడు నా మనస్సుకు అంతర్‌దృష్టిని కలుగజెయ్యి, భగవంతుడు చెప్పిన మాటలు ఉన్నది ఉన్నట్లుగా అర్థంచేసుకొనే ప్రసాద బుద్ధిని కలుగజెయ్యి అని భగవంతుడిని ప్రార్థించాలి.

మీ మనస్సులో దోషంలేదు అనుకోండి, మనస్సు పరిశుద్ధంగా ఉంది అనుకోండి, అదే పనిగా మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తూ ఉంటే వాడి మనస్సులో ఏమి ఉందో మీకు తెలుస్తూ ఉంటుంది. దానిని మీరు అంగీకరిస్తే ఏ దుఃఖం రాదు. కొంతమంది ప్రతీదానికి పెడఅర్థాలు తీస్తారు. వారిని కూడా మనం ఏక్సెప్ట్ చేయాలి. ఏక్సెప్టెన్స్ అనే దానిని ఒక మంత్రం క్రింద జ్ఞాపకం ఉంచుకోవాలి. ఎందుకు పెడ అర్థాలు తీస్తారంటే వారి మనస్సులో దుర్మార్గం ఉంది, ఆ దుర్మార్గాన్ని ఏక్సెప్ట్ చేసారు అనుకోండి ఇంక మీకు రియాక్షన్ రాదు, వాడు విరోధి అనికూడా అనుకోరు, వాడి స్వభావం అంతే అనుకొంటారు. స్నేహితులను, విరోధులను సమానంగా చూడమని చెపుతారు. దీనికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు ఉంటేకదా ఇతరులు, అసలు నువ్వే లేనప్పుడు ఇతరులు ఎక్కడ నుండి వస్తారు అంటున్నారు. మొత్తానికి గుండు చేస్తున్నారు. నీకు మనస్సు ఉంటే వాడు స్నేహితుడు, వీడు విరోధి అంటావు. తరువాత వారిని సమానంగా చూడమని పెద్దలు చెప్పటం ఈ గొడవ అంతా. మనస్సే లేనప్పుడు ఇతరులు ఎక్కడ ఉంటారు. మనస్సును లోపలకు పంపమని చెపుతున్నారు. అది నాకు సహాయం చేస్తే లోపలకు పంపగలనుగాని అది నాకు సహాయం చేయకుండా దానిని ఎలా లోపలకు పంపగలను అని అడుగుతున్నాడు. దానికి భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నిజమే, మనస్సు సహాయం లేకుండా మనస్సును ధ్వంసం చేయలేము. నీ లోపల ఉన్న జ్ఞాన సముద్రం నీకు తెలియకుండా, అదే నువ్వు అనే అవగాహన నీకు కలుగకుండా చేసేది నీ మనస్సే. నీ మనస్సే నీకు అడ్డు వస్తోంది. అయితే ప్రమాదం ఎక్కడ వస్తోంది అంటే కొన్ని యుగాలనుండి నీవుకాని మనస్సును నీవు అని, అదే ఆత్మ అని అనుకొంటున్నావు. ఆ మనస్సును ఏదైనా అంటే వూరుకోవు, ఆ మనస్సుగారిమీద ఈగవాలనివ్వవు. ఎందుచేతనంటే మనస్సే ఆత్మ అనుకొంటున్నావు, అదే నువ్వు అనుకొంటున్నావు. ఇంక దానిని పోగొట్టుకోవటానికి ఏమి ప్రయత్నం చేస్తావు. ఆ మనస్సు నీవుకాదు అని ముందు

అంగీకరించు. జ్ఞానం ఎవరికి కలుగుతుంది అంటే ఈ శరీరం ఉండగా చనిపోయి మరల అదే శరీరంలో ఎవడైతే పుడతాడో వాడికి మటుకే జ్ఞానం కలుగుతుంది. మనస్సు సహాయం లేకుండా మనస్సును నాశనం చేయలేము. మనోనాశనం అయితేగాని బ్రహ్మానుభవం కలుగదు. మనస్సును అదే నేను, అదే నేను అనుకొంటున్నావు. నీవు ఏమి చేయాలంటే ఆ మనస్సు నీవు కాదు అని నిర్ధారణకురా, అది అంగీకరించు తర్వాత సాధన ప్రారంభించు. ఇప్పడు నీకు యజమాని దేవుడు అని నీవు అనుకోవటం లేదు, మనస్సే యజమాని అనుకొంటున్నావు. నీ మనస్సే నీకు యజమాని అనుకొన్నప్పడు అది ఎటుగంతు వెయ్యమంటే అటు గంతువేస్తావు, ఎలా మాట్లాడమంటే అలా మాట్లాడతావు. ఆ మనస్సు నువ్వుకాదు అని కృతనిశ్చయానికి రా. అది నువ్వుకాదు అని నీకు అర్థమయితే నెమ్మదిగా పల్చబడి, ఎప్పడో ఒకప్పడు నీకు తెలియకుండా అది రాలిపోతుంది. మొదట మనస్సు నువ్వు కాదు అని నిర్ణయానికి రా. మనస్సు యొక్క మొదలులో నీరు పోయకు, నీరు పోస్తే అది ఎలా చనిపోతుంది. నీవు శరీరానికి స్నానం మానేస్తావుగాని మనస్సుకు నీరు పోయటం మానవు ఎందుచేతనంటే అదే నువ్వు అనుకొంటున్నావు. మనోనాశనం అయితేగాని నీకు ఆత్మలబ్ధి కలుగదు. ఆత్మలబ్ధి కలిగితే అన్ని రూపాలు నీడలే. ఏ నీడను ప్రేమిస్తావు? ఏ నీడను ద్వేషిస్తావు? మీరుకాని దానిని అవును అనుకోవటం మానివేయండి. నాకు తెలుసును అంటే జ్ఞానం, నాకు తెలియదు అంటే అజ్ఞానం అనుకొంటాము. అది కాదు జ్ఞానం అంటే. ఏ ప్రకాశం వలన నాకు తెలియదు, నాకు తెలుసును అని తెలియబడుతోందో ఆ ప్రకాశమే ఆత్మజ్ఞానం. ఈ సృష్టి అంతా జడం అయినప్పటికీ ఏ ప్రకాశం వలన అది ఉన్నట్లు మనకు తెలియబడుతోందో అది జ్ఞానం.

వారు చెడ్డవారు, వీరు మంచివారు అనుకొంటాము అనుకోండి. అప్పడు కదా వారిమీద ప్రేమగాని, ద్వేషంగాని వచ్చేది. అంతాకూడా మనమే అనుకొంటే ఎవరిని ప్రేమిస్తావు, ఎవరిని ద్వేషిస్తావు. అప్పడు మనస్సులోపలకు వెళ్లటం ప్రారంభిస్తుంది. మనస్సులోని విషం పిండేయాలి. జ్ఞానికికూడా మనస్సు ఉంటుంది. వారి మనస్సుకు మన మనస్సుకు తేడా ఏమిటి అంటే అది మృతమనస్సు అంటే విషం పిండేసిన మనస్సు. మనది విషంతోకూడిన మనస్సు. నీ పళ్ళు ఒకోసారి నాలుకను కరుస్తాయి. మనకు కోపం వచ్చి పళ్ళు ఊడగొట్టుకుంటామా? లేదు ఎందుచేత అవి కూడా మనమే కాబట్టి. ఇంకోసారి పళ్ళు కరవకుండా జాగ్రత్త పడతాముకాని పళ్లమీద విరోదం పెట్టుకోము. అలాగే మంచివాళ్లము

మనమే, చెడ్డవాళ్లము మనమే అనుకొంటే ఇంక ఏ గొడవలేదు. మనస్సును మచ్చిక చేసుకొని అందులో ఉన్న విషం పిండాలి. మనస్సును బంగారం చేసుకో. నీ ఇంట్లో ఉన్న బంగారం వలన ముక్తిరాదు. భక్తివలన ముక్తి వస్తుంది. నీ మనస్సును భక్తి అనే బంగారంతో నింపుకో. భగవంతుని పాదాలే బంగారం, అదే నిజమైన ధనం అనుకొని ఆయన పాదాలను ఆశ్రయించి జీవిస్తే నువ్వు బంగారం అవుతావు. నువ్వు బంగారం అయ్యాక మోక్షం దగ్గరకు నీవు వెళ్లనక్కరలేదు మోక్షమే వచ్చి నిన్ను వరిస్తుంది. మనస్సుతో ధ్యానం, జపం చేస్తున్నావు. నిన్ను పొడిచేస్తాను, చంపేస్తాను అని మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు, దానిని రెచ్చగొట్టవద్దు. దానిని మచ్చిక చేసుకో. ధ్యానం చేసేటప్పుడు ఈ మనస్సుగారు ఏంచేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు అని చూసుకో. వివేకం, వైరాగ్యం, ఆలోచనతో కూడిన ప్రవర్తన కలిగిఉండి పరిశుద్ధమైన జీవితం సహాయంతో మనస్సును పరిశుభ్రంగా తయారుచెయ్యి. మనస్సు ఎక్కడయితే ఉదయిస్తుందో ఆ పుట్టుచోటు తెలుసుకోవటానికి నీ జపం, ధ్యానం సహకరించాలి లేకపోతే వాటి ప్రయోజనం లేదు. నీమాట స్పష్టంగా లేదుఅనుకో, నీ ఆలోచన స్పష్టంగా లేదుఅనుకో, నీ బిహేవియర్ సరిగాలేదు అనుకో లోపల ఏదో వెలితి ఉందని గ్రహించి, దానిని అంగీకరించి ఆ రోగాన్ని బయటకు గెంటివెయ్యి అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది.

లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. ఏ ఆకర్షణకు మీరు లొంగిపోయిన ఆత్మ జ్ఞానానికి అర్హత ఉండదు. లోకానికి సంబంధించిన ఆకర్షణలు నీకు ఏమీ లేకపోతే నీకు అర్హత వస్తుంది. తర్వాత ఆత్మజ్ఞానం రావచ్చు, రాకపోవచ్చును. లోకంలో ఏమీ ఆకర్షణలు లేనంతమాత్రంచేత వాడికి ఆత్మజ్ఞానం వచ్చేయదు, అప్పుడుకూడా వాడికి ఈశ్వరానుగ్రహం ఉండాలి. మనం చాలావాసనలు జయించాము అనుకోండి. ప్రాణం పోయేటప్పుడు ఒక చిన్నవాసన మిగిలినా మరల జన్మ వచ్చేస్తుంది. వాసనను బట్టి పనిచేస్తూ ఉంటావు. ఆ వాసనే నువ్వు అనుకొంటున్నావు. ఆవాసన నీవుకాదుఅనే బుద్ధి కలగటానికే సత్పురుషుల సహవాసం, సద్గ్రంథ పఠనం, ఈశ్వరుని దర్శనంకూడా దానికే. మనస్సు శుద్ధి అయితే ఈశ్వరుడు చెప్పింది చెప్పినట్లుగా అర్థమవుతుంది. రెండు తలంపులు నీకు ఒకేసారి రావు. ముందు ఒక తలంపు వస్తుంది. అది వెళ్లిపోతుంది. మరల ఇంకో తలంపు వస్తుంది. అది వెళ్లిపోతుంది. ఆ తలంపుకు, తలంపుకు మధ్యభాగం ఉంటుంది. అదే చిదాకాశం. ఆ డ్యూరేషన్ పెంచుకో. అది పెంచుకొంటే మనస్సు వెళ్లి హృదయగుహలో పడిపోతుంది.

నువ్వు లోకాన్ని మోసం చేయగలవుగాని నీలోపల ఉన్న కంట్రోలర్‌ను మోసం చేయలేవు అని భగవాన్ చెప్పారు ఎందుచేతనంటే ఆయన అంతర్యామిగా ఉన్నాడు, అంతటా ఉన్నాడు. నీ మనస్సులో ఏమి ఉందో పరిశీలన చేసిచూసుకో, మనస్సులో ఏదైనా బలహీనత ఉంటే దానిని తొలగించుకో, లేకపోతే అది కొన్ని వందల జన్మలకు కారణం అవుతుంది. నీకు ఎటుచూసినా దేవుడే కనిపిస్తూ ఉంటే, చైతన్యమే కనిపిస్తూ ఉంటే చైతన్యం గురించి మాట్లాడు. నీకు ఎక్కడ చూసినా జడమే కనిపిస్తూ ఉంటే చైతన్యం గురించి నీవు ఏమి మాట్లాడతావు అన్నారు భగవాన్.

నూటికి నూరుపాళ్ళు నీ మనస్సును నమ్మకు. అది చమత్కారములు చేస్తూ ఉంటుంది. ఆ చమత్కారములు చేసేటప్పడు మనస్సు దాని చమత్కారములు చూపిస్తోందనే గ్రహింపు నీకు లోపల ఉండాలి. గాంధీగారు చదువుకొనే రోజులలో ఏదోపొరపాటుచేస్తే గాంధీ తండ్రి ఆయనతో నీవు ఈ పొరపాటుచేయవద్దు అని చెప్పలేదు. ఆయన తండ్రిలో ఉన్న గొప్పతనం చూడండి. ఆయన గాంధీతో ఏమి చెప్పారు అంటే నీవు పెద్దపెద్ద చదువులు చదవాలని నేను కోరుకోవటం లేదు, ధనం సంపాదించాలని నేను కోరుకోవటంలేదు కాని ఒకటి పవిత్రత మటుకు కాపాడుకో. చధువుకాని, ధనంకాని పవిత్రతకంటే, శీలంకంటే గొప్పవికావు. పవిత్రత లేదు అనుకో ఎంత చదువుఉన్నా, ఎంత ధనంఉన్నా ప్రయోజనం లేదు అని చెప్పారు. దైవీ సంపద పుట్టుకతో వచ్చిందిఅనుకో మధ్యలో దేహప్రారబ్దమునుబట్టి ఏదైనా పొరపాటు జరిగినా వెంటనే వాడు వెనక్కి తిరుగుతాడు, మరల అభివృద్ధిలోనికి వచ్చేస్తాడు. సాధన జాగ్రత్తగా చేస్తూఉండు. సాధన అంటే పోరాటం. మనస్సు దానిబలం చూపిస్తూ ఉంటుంది. మనస్సు దాని పట్టుదల అదివిడిచి పెట్టనప్పడు మన పట్టుదల మనం ఎందుకు విడిచిపెట్టాలి. భగవాన్ టెక్నిక్ చెపుతున్నారు. నీవు మనస్సుతో పోరాడుతూ ఉండు. కొంతకాలానికి మనస్సు వీక్ అవుతుంది. ఆ వీకెన్ అయిన సమయం చూసుకొని సడన్‌గా వెళ్ళి మనస్సు మీదపడు. అప్పడు అది హృదయంలోనికిపోతుంది. మనస్సు వీకెన్ అవ్వకుండా దానిమీద పడినా అది విజృంభిస్తుంది. సాధనాబలంతో ఎప్పడైతే మనస్సు మీద పడ్డావో ఆ మనస్సు అది ఎక్కడ నుండి ఉదయించి వచ్చిందో అక్కడకు సడన్‌గా వెళ్ళి రాలిపోతుంది. మనస్సు హృదయంలోనికి ఎప్పడైతే వెళ్ళిపడిపోయిందో లోపల ఎవరు ఉన్నారు? ఈశ్వరుడు ఉంటాడు. ఆయన ఈ మనస్సును చింపేస్తాడు. ఆక్కడ మీరు తప్పించి ఏదీ ఉండదు, ఆనందమే ఆనందం, శాంతే శాంతి. ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు.

ఇప్పుడు ఏదైతే నేను, నేను అంటున్నానో అదే నిజం అనుకొంటున్నాను. కాని అది దొంగనేను, నకిలీనేను అని మీరు చెపుతున్నారు. నిజమైననేను లోపల ఉంది అని చెపుతున్నారు. కొన్నివేల జన్మలనుండి ఇదే నిజమైననేను అని నమ్ముకొంటూ వస్తున్నాము. ఇప్పుడు మీరు ఆ బోట్లు ఊడగొడుతున్నారు. నాకు కంగారుగా ఉంది, భయం వేస్తోంది. ఎందుకు ఊడగొడుతున్నారు అంటే అదిపోతేగాని నిజం తెలియదు. నిజం తెలిస్తేగాని స్వేచ్ఛ లేదు, శాంతి లేదు, మోక్షం లేదు. దొంగనేనును పోగొట్టుకొనే విధానం చెప్పండి. దాని మూలం అది చూసేవరకు అది నశించదు. నిజమైననేను నీలోపలే ఉంది. దానిచేతికి అందేవరకు దీనిని లోపలకు తోలుకొని వెళ్ళు. తరువాత పని అది చేసేస్తుంది. వాసన బయటకు వెళ్ళేటప్పుడు కొంత పీడిస్తుంది. ఆపీడను తట్టుకోవాలి. తట్టుకొంటే సక్సెస్ అవుతావు, తట్టుకోలేకపోతే మనం ఫెయిల్ అవుతాము. అప్పుడు గురువు సహాయం అవసరం. గురువు సహాయం లేకపోతే పడిపోతాము. భగవాన్ ఏమి చెప్పారుఅంటే సాధనచెయ్యి, సాధనచెయ్యి, సాధనలో ఏమీలేదు అన్నసంగతి తెలిసే వరకూ సాధన చెయ్యి అనిచెప్పారు. ఆపరేషన్‌కు ముందు పేషెంట్‌ను నర్సులు తయారుచేస్తారు. నీవు చేసే సాధన ఎంతవరకు అంటే నర్సులు చేసేపని చేస్తుంది. కాని చిత్తును, జడవస్తువును కలిపే గ్రంధిని సర్జరీ చేసేటప్పుడు ఈశ్వరుడే దానిని కట్ చేస్తాడు. దానికి నీ తెలివితేటలు సరిపోవు. జడమే నువ్వు అనుకొనే బుద్ధిని ఈశ్వరుడే కట్‌చేస్తాడు. అప్పుడు నీకు చైతన్యబుద్ధి కలుగుతుంది. చైతన్యబుద్ధి కలిగాక ప్రకృతినీకు దారి ఇచ్చేస్తుంది, అప్పుడు ఇంక నీకు సాధనతోపని లేదు. అక్కడ ఉన్నది నువ్వు ఒక్కడివే, ద్వితీయం లేదు. మీ అందరి హృదయాలలో ఉన్న నారాయణుడే వాడికి కనిపిస్తున్నాడు అనుకోండి. ఇంక వాడికి శత్రువు ఏమిటి? మిత్రుడు ఏమిటి? అప్పుడు వాడిచూపు నిజమైన చూపు.

**దుర్గుణములు మనస్సును బాహ్యాముఖ పరుస్తాయి.**
**సద్గుణములు మనస్సును అంతర్ముఖ పరచుటకు సహాకరిస్తాయి.**

# కర్మఫలం మీద దృష్టిలేకుండా కర్మ చేయటమే వైరాగ్యం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-01-2001, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మన మనస్సు సంస్కరింపబడటంకోసం, మన హృదయం విశాలం అవ్వటం కోసం దైవభక్తి, దేశభక్తి రెండూ అవసరం. నీకు కుడిచేయి అవసరమా, ఎడమచేయి అవసరమా అని అడిగితే రెండూ అవసరమే అని చెపుతారు. అలాగే సమాజం అభివృద్ధిపొందటానికి శాస్త్రజ్ఞానం ఎంత అవసరమో ఆధ్యాత్మికజ్ఞానంకూడా అంతే అవసరం. శాస్త్రజ్ఞానం శరీరానికి కంఫర్టు తీసుకొని వస్తుంది. ఆధ్యాత్మికజ్ఞానం మనస్సుకు కంట్రోలు తీసుకొని వస్తుంది. ఒక అవయవం చేసేపని ఇంకో అవయవం చేయమంటే చేయలేదు. మనిషికి అన్ని అవయవాలు అవసరమే అలాగే సమాజం యొక్క అభివృద్ధికి నాలెడ్జియొక్క అన్ని శాఖలు అవసరమే. మనం దేవాలయాలలో ఎలా అర్చన చేస్తామో అలాగ దేశానికి అర్చన చేయాలి అంటే దేశాన్ని ప్రేమించాలి, దేశభక్తి పెంచుకోవాలి. దేశభక్తి ఎందుకు పెంచుకోవాలి అంటే ఇప్పుడు మనకు ప్రాంతీయతత్వం ఎక్కువ అయిపోయింది. మనది నర్సాపురం అనుకొంటాముగాని మనది భారతదేశం అనుకోవటం లేదు. భారతదేశం ఉంది కాబట్టి నర్సాపురం, పాలకొల్లు, హైదరాబాద్ ఇవి అన్నీ ఉన్నాయి. ఈదేశం మనది అనే విశాలదృష్టి అలవర్చుకోవాలి. మనదేశంలో ఉన్న పెద్ద బలహీనత ఏమిటి అంటే ఐక్యత లేకపోవటం. పూర్వం అదే, ఇప్పుడు కూడా అదే. మనలను అందరూ ప్రేమించాలి, మనం ఎవరినీ ప్రేమించకూడదు. ఇది ఈనాటి పరిస్థితి. భక్తులలో కూడా ఇదే పరిస్థితి అడ్డబొట్లు, నిలువుబొట్లు గొడవ. విష్ణువు గొప్పవాడా, శివుడు గొప్పవాడా ఇదే తగువు. వారికి దేశం గొడవ లేదు. అసలు భక్తి ఎందుకు, దాని ప్రయోజనం ఏమిటి, దాని గమ్యాన్ని మరిచిపోయేటట్లు చేసారు. పూర్వంమాట వదిలివేయండి, ఈనాటికి కూడా అవే పేచీలు.

ఆనందం, సుఖం, శాంతి బయట ఎక్కడాలేదు, మన స్వరూపంలోనే ఉంది. ఆనంద స్థితికి తీసుకొనివెళ్ళటమే మతం యొక్క ప్రయోజనం. హిందూమతం అంటే అది ఒక సనాతన ధర్మం. అది ఒక వ్యక్తి స్థాపించినది కాదు. ధర్మాన్ని ఆచరించు దానివలన నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు తెలియబడుతుంది. మతంలో చెప్పినమాటలను చిలుక పలుకులుగా పలకటం కాదు, వాటిని ప్రాక్టీసుచేయాలి. ఏ వేదాంతగ్రంథం చదివినా

మనోనాశనం గురించి చెప్పారు. మనస్సు నశిస్తే ఎలాగ మనస్సు ఉండాలికదా. మనస్సు ఆజ్ఞ ఇస్తేనే కదా దేహంపనిచేసేది, ఇంద్రియాలు పనిచేసేది అని ప్రశ్న. శాస్త్రంయొక్క ఉద్దేశం ఏమిటి అంటే వాసనలతోకూడినటువంటి, అలవాట్లతో కూడినటువంటి అపరిశుద్ధ మనస్సును నశింపచేసుకోమని శాస్త్రం చెపుతోంది. నేను, నాది అనే తలంపును నాశనం చేసుకోమని చెపుతోంది. నేను, నాది ఎక్కడ ఉన్నాయి. మనస్సులో ఉన్నాయి. దానిని అపరిశుద్ధ మనస్సు అంటారు. లోపల ఉన్నది పవిత్రతే అలాగే నీ మనస్సుకూడా అంత పవిత్రమైతే నదివెళ్ళి సముద్రంలో కలిసినట్లు పరిశుద్ధమనస్సు వెళ్ళి హృదయంలో కలిసిపోతుంది అంటే బ్రహ్మంలో లయమవుతుంది. పరమార్థం ఎక్కడోలేదు మన హృదయంలోనే ఉంది. దైవీసంపద ఉన్నవాడికి సత్యం హృదయంలోనే స్ఫురిస్తుంది, నారాయణుడు తానుగానే వ్యక్తమవుతాడు. దైవీసంపద పెంచుకొన్నవాడు మాత్రమే సత్యాన్ని హృదయంలో అన్వేషిస్తాడు. ఏకాగ్రమైన మనస్సుకు, పవిత్రమైన మనస్సుకు లోపల ఉన్న సత్యాన్ని అన్వేషించే అర్హత కలుగుతుంది. మనకుఎంత అర్హత, యోగ్యత ఉంటే అంతే వస్తుంది.

ఎక్కడికి వెళ్ళిచూసినా రాగద్వేషములు తప్ప ప్రకృతిలో ఏముంది అన్నాడు బుద్ధుడు. రాగద్వేషములు మనస్సును బాహ్యముఖం చేస్తాయి, మనస్సును అపరిశుద్ధం చేస్తున్నాయి. ఇవి రెండూ తగ్గించుకొంటేగాని మనస్సుకు అంతర్దృష్టి కలుగదు. మనకు విషయానందం తెలుసు, బ్రహ్మానందం తెలియదు. బ్రహ్మానందం తెలిసిన వారిని యోగులని, ఋషులని పిలుస్తారు. బ్రహ్మానందం బ్రహ్మంలో ఉంది, దాని స్వరూపమే ఆనందం. బ్రహ్మానందం మనస్సులో ఉంది అని మనం అనుకొంటున్నాము. మనస్సులో ఉన్నది అంతా పెంట. గందరగోళం అంతా మనస్సులోనే ఉంది. అక్కడ ఉన్నంతసేపు నీకు గందరగోళం తప్పదు. అపరిశుద్ధమనస్సును అతిక్రమించాలి. మనోమూలంలోనే నారాయణుడు ఉన్నాడు. మనోమూలం ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి వెళ్ళాలంటే అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా, పుణ్యబలం లేకుండా, పుణ్య కర్మలు ఆచరించకుండా నీవు అక్కడికి చేరుకోలేవు. సత్యవస్తువు పుస్తకాలలో లేదు, మనోమూలంలో ఉంది. అందువలన నీవు పరిశీలించవలసింది పుస్తకాలనుకాదు, మస్తకాన్ని పరిశీలించు, మస్తకాన్ని పరిశోధించు వైరాగ్యం అంటే పని లేకుండా కూర్చోమనికాదు, కర్మఫలం పట్ల ఆసక్తిలేనివారు వైరాగ్యవంతులు. ఈశ్వరానుగ్రహం ఉంటే మోక్షం వస్తుంది. ఈశ్వరానుగ్రహం ఎలా వస్తుంది అంటే నీవు కష్టపడి పనిచేస్తే కర్మఫలం పట్ల ఆసక్తి లేకుండా పనిచేస్తే నీవుచేసే కృషే కృపగా మారుతుంది.

కృషికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. నీవు డబ్బు ఎందుకు సంపాదిస్తున్నావు, సుఖం కోసం. నీవు ఏ ప్రయత్నం చేసినా సుఖపడాలనే కదా. కాని నిజమైన సుఖం నీ హృదయంలోనే ఉంది, బ్రహ్మంలోనే ఉంది. బ్రహ్మానుభవం నీకు కలిగేవరకూ దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. భావశుద్ధిలేనివాడికి జ్ఞానశిద్ధి కలుగదు. వాడు ఎంతటివాడు అయినప్పటికి. అందువలన మనకు వచ్చే భావాల విషయంలో, తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి.

ఎవడో అజ్ఞానంగా ప్రవర్తిస్తున్నాడని నీవు అజ్ఞానంగా ప్రవర్తించకు. ఎవడో పరుష వాక్యాలు మాట్లాడాడుఅని నీవుకూడా పరుష వాక్యాలు మాట్లాడకు. వాడు ఏదైనా అజ్ఞానంలో మాట్లాడాడు అనుకో నీవు జ్ఞానాన్ని ప్రదర్శించి, జ్ఞానస్థితిలో స్థిరంగా ఉండి వాడిని అజ్ఞానంలో నుండి బయటకు తీసుకొనిరావటానికి ప్రయత్నం చేయాలిగాని వాడు అజ్ఞానంలో ఉండి మాట్లాడాడు అని నీవుకూడా అజ్ఞానంలో ఉండి మాట్లాడవద్దు, అది పనికిరాదు, అది జ్ఞాని లక్షణం కాదు. రామకృష్ణుడు చెప్పినమాటలు చదువుతున్నాము అనుకోండి ఆమాటలు నీవు అంగీకరించవు. అంగీకరించినట్లుగా నటిస్తావు. ఎందుచేతనంటే పవిత్రమైన మనస్సు చెప్పినమాటలు అపవిత్రమైన మనస్సు అంగీకరించదు. మనం కూడా అంతే నటిస్తున్నాము. ఈశ్వరుడు చెప్పిన వాక్యం అర్థమయితే మన మనస్సు అణిగిపోతుంది. దేహానికి ఇంద్రియాలు ఉన్నాయి. ఆత్మకు ఇంద్రియాలు లేవు. ఆత్మను ప్రత్యగాత్మ అంటారు. నీ ఇంద్రియాలకంటే, దేహంకంటే, మనస్సుకంటే, నీరాగద్వేషములకంటే, నీ సంకల్ప వికల్పములకంటే అది ప్రత్యేకంగా ఉంది. అది నీ దేహంలో ఒక భాగంకాదు అది ప్రత్యేకంగా ఉంది. దానికి ఒక రూపం లేదు, నామం లేదు, గుణాలు లేవు. ఈ దేహమును నేను అని ఏ నేను అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో ఆ నేను ఉన్నంతకాలం జీవుడు ద్వైతబుద్ధిలోనుండి బయటకు రాలేడు. నీ దుఃఖానికి, భయానికి ద్వైతమే కారణం. మనం చేసేపని నిర్మలంగా ఉంటే, సహజంగా ఉంటే దేహబుద్ధి ఆరోజుకారోజు పల్చబడుతుంది.

మనకు ఉప్పసముద్రం దూరంగా ఉందిగాని ఆనందసముద్రం దగ్గరలోనే ఉంది. అందులో ఉన్న ఆనందాన్ని, శాంతిని తృప్తి కలిగేవరకూ ఎవడైతే రమిస్తున్నాడో వాడి ఆనందం స్థిరంగా ఉంటుంది, వాడి జ్ఞానం స్థిరంగా ఉంటుంది. వాడు గుణాతీతుడు, వాడు ప్రకృతిని జయించినవాడు. హృదయంలో ఉన్న శాంతి, ఆనందం అలౌకికమైనది, అభౌతికమైనది. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు సుఖం వచ్చినా సుఖం క్రింద అనిపించదు,

దుఃఖం వచ్చినా దుఃఖం క్రింద అనిపించదు. వాడు ఇంద్రియాతీతుడు. దేహప్రారబ్దంలో ఉన్నది వస్తూ ఉంటుంది. హృదయంలో ఉన్న ఆనందాన్ని అనుభవించేటప్పుడు ప్రారబ్దంలో ఉన్నది ఏది వచ్చినా దాని ప్రభావం నీమీద ఏమీ ఉండదు. మనం సాధనచేసి అపవిత్రమైన మనస్సును చింపేవరకూ అశాంతి, దుఃఖం ప్రతీజన్మలోనూ వెంటాడుతుంది. భగవాన్ చెపుతూఉంటారు తెరమీద బొమ్మలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి, గాలివానలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి, ఇళ్ళు అంటుకొంటాయి ఆరిపోతాయి కాని నీవు ఆ తెరను మర్చిపోకు. తెరను మర్చిపోకుండా ఉంటే బొమ్మల ప్రభావం నీమీద ఏమీ ఉండదు. ఈసృష్టికి అంతా ఆధారంగా ఒక వస్తువు ఉంది, బ్రహ్మం ఉంది. దానిని మర్చిపోవద్దు. బ్రహ్మానుభవం పొందటంలో నీవు చేస్తున్న కృషిలో అశ్రద్ధపనికిరాదు, వివేకాన్ని పెంచుకో.

స్త్రీకి పురుషుడు అమృతంలాగ కనిపిస్తాడు, పురుషుడికి స్త్రీ అమృతంలాగ కనిపిస్తుంది అక్కడ విషం ఉన్నప్పటికి ఇదే మాయ అన్నారు స్వాములవారు. లోకంలో అనేక భోగాలు ఉన్నాయి. ఆభోగాలు నీవు అనుభవించేటప్పుడు అందులో 10 వంతులు సుఖం రావచ్చు ఆ సుఖాన్ని నీవు ఎంజాయ్ చెయ్యవచ్చు కాని ఆ సుఖం వెనకాల 90 వంతులు దుఃఖం వస్తుంది అని తెలుసుకొని చెయ్యి. గుణాలయొక్క మాయలో ఉన్నంతకాలం సద్వస్తువు నీకు తెలియదు. గుణాలను అతిక్రమించి ఎవడైతే నిదానంగా ఉన్నాడో వాడినే జ్ఞానం వరిస్తుంది. నీవు ఎలా పని చేయాలి అంటే మనస్సు భగవంతుడిమీద ఉండాలి, ఇంద్రియాలతో పనిచేయాలి. అలాపనిచేస్తే నీవు తరిస్తావు శిష్యుడు గురువును చూడటానికి వెళ్ళకపోయినా గురువు శిష్యుడిని చూడటానికి వెళతాడు ఎందుచేతనంటే శిష్యుడిది మానవప్రేమ, గురువుది దైవప్రేమ. ఒక భక్తుడు భగవాన్‌తో మీరు ఎప్పుడూ ఈ అరుణగిరి దగ్గరపడి ఉంటారు కాశీ, రామేశ్వరం అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి వాటిని చూడవచ్చుకదా అంటే చూడటానికి ఏముంది ఈసృష్టిలో అన్నారు భగవాన్. నువ్వు దేహగతమైన నేనుతో చూస్తే అదిలోకం. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు అప్పుడు నీవూ బ్రహ్మమే, లోకమూ బ్రహ్మమే అంతా బ్రహ్మమే.

**అరుణాచల మనుచు స్మరియించు వారల**
**అహము నిర్మూలింతు వరుణాలా॥**

## మనకు ఉన్న శక్తిని, తెలివిని మనలో ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి ఉపయోగించాలి

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-2001, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

దైవత్వాన్ని కాని, నిజమైన జ్ఞానాన్నికాని పొందాలనుకొనేవ్యక్తి ఎడతెగని భక్తిని అభ్యసించాలి. భక్తిని జ్ఞానమాత అంటారు. తల్లిలేకుండా బిడ్డరాదు అలాగే భక్తిలేకుండా జ్ఞానంరాదు. జన్మించినవాడు మరణించటం, మరణించినవాడు మరల తిరిగి జన్మించటం అది ప్రకృతి నియమం. మనం ప్రకృతిలో ఉన్నంతకాలం పునర్జన్మ వచ్చి తీరుతుంది. అందులో సందేహం లేదు. ప్రకృతి గుణాలు అంటే తమోగుణం, రజోగుణం, సత్వగుణాలలో ఉన్నంతకాలం, నీ మనస్సులో మురికి గుంటలు ఉన్నంతకాలం పునర్జన్మ వచ్చి తీరుతుంది. ఆత్మవిద్య ఎవరైతే భోధిస్తున్నారో వారు అందరూ ధైర్యంగా ఉండుగాక అని వేదంలో చెప్పారు. ఆత్మవిద్యను భోదించేవాడు అభయస్థితిలో ఉండాలి. ఒకోమనిషికి ఒకో అనారోగ్యం ఉండవచ్చు. అది పోయిన తరువాత ఆరోగ్యం వచ్చిన తరువాత అందరూ సమానమే. అలాగే ప్రకృతి గుణాలలో ఉన్నంతకాలం మనుషులు రకరకాలుగా ఉంటారు. ప్రకృతిగుణాలు దాటాక అందరూ సమానమే. అక్కడ ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అంటే ఆమాటకు అర్థంలేదు. భక్తిని విడిచిపెట్టవద్దు. భక్తిలేకుండా జ్ఞానంరాదు. ఈజన్మలో మీకు జ్ఞానం కలిగింది అంటే పూర్వజన్మలో భక్తిగురించి మీరు అభ్యాసం చేసి ఉంటారు. శరీరం మరణిస్తే జ్ఞానం రాదు. శరీరానికి ఏమీ ప్రాముఖ్యత ఇవ్వలేదు. మనస్సు మరణిస్తే వాడికి జ్ఞానం కలుగుతుంది, మోక్షం వస్తుంది. మీకందరికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. కంగారు పడవద్దు. మీ తెలివిని, శక్తిని పాడుచేసుకోవద్దు. ప్రతీ మనిషికి ఎంతోకొంత తెలివి ఉంటుంది. మనం అనవసరమైన విషయాల గురించి ఆలోచించి తెలివిని, శక్తిని పాడుచేసుకొంటున్నాము. నీ తెలివిని, శక్తిని నీ హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి ఉపయోగించుకోవాలి. నీ తెలివిని, శక్తిని పాడుచేసుకోకూడదు. ఇది సాధకులు అందరూ గుర్తించుకోవలసిన విషయం. మనకు చైతన్యానుభవం కలిగినప్పడుగాని ఆ ప్రేమతత్వం, జ్ఞానతత్వం మనకు అవగాహనకాదు, ఊహించుకోవటం వలన అది మనకు తెలియదు. వస్తువు అనుభవంలోనికి వస్తేగాని మనం గుణాలకు అతీతంగా ఉండలేము. ఒకేసారి మనం గుణాలకు అతీతంగా ఉండలేముకాబట్టి సత్వగుణాన్ని ఆశ్రయించాలి. సత్వగుణాన్ని ఎంతబాగా ఆశ్రయిస్తే అది సద్వస్తువును తెలుసుకోవటానికి అంత సహకరిస్తుంది. మా మనస్సును ఈశ్వరుడికి ఇచ్చాము కాని మరల గుణాలు వస్తున్నాయి అంటే మీ మనస్సును నోటితో ఇచ్చారు కాని క్రియలో

ఇవ్వలేదు అని అర్థం. మనస్సును నెమ్మదిగా పక్కానికి తీసుకొని రావాలి కంగారు పడకూడదు. ఈశ్వరుడు నీ లోపల అంతర్యామిగా ఉన్నాడు, అంతా పరిశీలిస్తున్నాడు, నీ మనస్సు ఎంత పక్కానికి వచ్చిందో చూస్తున్నాడు. నీ మనస్సు పక్కానికి రావటానికి, నీకు వైరాగ్యం కలగటానికి, నీ హృదయం ఖాళీ అవ్వటానికి తగిన ఎత్తుగడ చేస్తున్నాడు. నీ హృదయాన్ని నీవు ఖాళీ చేసుకోలేవు. ఈశ్వరుడిని స్మరించగా, స్మరించగా ఈశ్వరుని పాదాలను విడిచి పెట్టకుండా ఉంటే నీ హృదయం ఎలా ఖాళీ చేయాలో ఈశ్వరుని ప్రణాళికలో ఆ సన్నివేశం తీసుకొని వస్తాడు, తలుపు సందున పెట్టి నొక్కుతాడు. హృదయం ఖాళీ అవ్వకుండా ఎవరికీ జ్ఞానం కలుగదు.

గురువు అంటే ఎవరో అనుకొంటున్నావు గురువు అంటే ఆనందం, గురువు అంటే శాంతి, గురువు అంటే ఆత్మ. నీ హృదయంలో ఉండి జన్మల తరబడి, యుగాల తరబడి నిన్ను వాచ్‌చేసేవాడే శరీరం ధరించి వస్తాడు వాడు గురువు. తన సహజ లక్షణములు అయిన సత్యము, జ్ఞానము, అనంతము, అనుగ్రహములతో లోపల ఉన్న ఈశ్వరుడే శరీరం ధరించి వస్తాడు. వాడు గురువు. జన్మజన్మలనుండి మీ సాధనను గమనించి మీకు సత్యం గురించి భోదించటానికి ఒక శరీరం ధరించి వస్తాడు. శరీరం ధరించి వచ్చినా ఆ శరీరానికి పరిమితమై ఉండడు. బయట గురురూపంలో కనిపించేవాడు ఈశ్వరుడే. నిజమైన గురువు లోపలే ఉన్నాడు. వాడికి ఈ జీవుడిని స్వాధీనం చేయటంకోసం ఒక రూపం ధరించి వస్తాడు.

ఒకోసారి మీకుబాగా ఇష్టమైనవారితో తిట్టిస్తాడు లేకపోతే మీకు ఎటాచ్‌మెంట్ పోదు. ఆబంధం పోతేగాని హృదయం ఖాళీ అవ్వదు. హృదయం ఖాళీ అయితేగాని జ్ఞానోదయం అవ్వదు. నీకు ఆత్మజ్ఞానం కలగటంకోసం నెమ్మది, నెమ్మదిగా నీ మనస్సును ప్రిపేర్ చేస్తాడు. అందుకనే గురురూపం ధరించివస్తాడుగాని వాడికి వేరేపని ఏమీలేదు. ప్రారబ్ధంలో ఏది ఉంటే అది వస్తుంది కాని అనుగ్రహం ఏమిటి అంటే నీకు దేహంతో తాదాప్యం లేనప్పడు, తనువు తానుకాదు అని తెలిసినవాడికి ప్రారబ్ధంలో ఏది వచ్చినా నీకు ఏమీ అనిపించదు, ఏదీ నిన్ను పీడించదు. అది గురువు అనుగ్రహం.

గురువు గురించి ఎక్కువగా చెపుతున్నారు. గురువు లేకుండా కూడా కొందరికి జ్ఞానం కలిగింది కదా అని ఒక భక్తుడు ప్రశ్నిస్తున్నాడు. ఎంతో పరిపక్వమైన కొందరికి ఈశ్వరుడు రూపంలేని జ్ఞానజ్యోతిగా ప్రకాశించి నిజమైన జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు. అటువంటి రేర్‌కేస్‌లను అంటే అరుదైన సంఘటనలను దృష్టిలో పెట్టుకోకూడదు. అవి అన్నీ సామాన్యంగా

తీసుకోకూడదు, ఈ ఆధ్యాత్మిక మార్గంలో గురువు చాలా అవసరం. లోకం ఉందని నీవు అనుకొన్నప్పుడు నీవు మంచిచెయ్యి. ఎవరిని అనుకరణ చేయవద్దు. అనుకరణ పిరికివాడి లక్షణం. లోకంలో చాలామంది గురువులు ఉన్నారు. గురువును ఎలా ఎన్నుకోవాలి అని ప్రశ్న. ఎవరి బోధపట్ల నీ మనస్సు శృతికలుపుతోందో వాడే నీ గురువు. ఎవరి సమక్షంలో నీ మనస్సుకు చల్లదనం కలుగుతోందో, ఎవరి సమక్షంలో శాంతి వచ్చి నిన్ను వరిస్తోందో వాడే నీ గురువు. సద్గురువు, జగద్గురువు అంటారు సద్గురువు అంటే వాడు ఆత్మగా ఉండి ఆత్మగురించి బోధిస్తే వాడు సద్గురువు. జగద్గురువు అంటే వాడు ఆత్మగా ఉండటమేకాదు వాడు దేనిగురించి అయితే బోధిస్తున్నాడో ఆ సబ్జక్టులో ఈ సృష్టిలో ఎవరికి ఏ సందేహం వచ్చినా దానిని నివారించగలగాలి వాడు జగద్గురువు. సూదంటురాయి ఇనుమును ఎలా ఆకర్షిస్తుందో అలాగ గురువు చూపుపట్ల, మాటపట్ల, ప్రవర్తనపట్ల నీకు సహజంగా ఆకర్షణ కలగాలి.

వేదంలో సదాచారం ఎలా ఉంటుందో చెప్పారు. ఎవడు సదాచారం కలిగినవాడు అంటే చెడ్డను చూడటంలో వాడికి కళ్ళుఉన్నా ఎవడైతే గుడ్డిగా ఉంటాడో, చాడీలు చెప్పే సమయం వచ్చినప్పడు, దుర్భాషలు ఆడే టైము వచ్చినప్పడు ఎవడైతే మూగవాడిగా ఉంటాడో, ఇతరుల గురించి చెడ్డ మాటలు చెప్పేటప్పడు ఎవడైతే చెవిటివాడుగా ఉంటాడో వాడు సదాచారం కలిగినవాడు అని వేదంలో చెప్పారు. వేదం ఏవస్తువును అయితే ప్రతిపాదిస్తోందో ఆ వస్తువును అందుకోవటానికి నీ ప్రవర్తన ఎలా ఉండాలో నిర్వచిస్తోంది. ఈ సదాచారంలో నీవు ఉంటే అప్పడు వేదంలో ప్రతిపాదించబడిన వస్తువు నీకు ఎఱుకపడుతుంది. నీవు ఎవరో నీకు తెలియకపోతే గురువు ఎవరో నీకు తెలియదు. నీవు ఎవరో నీకు తెలియకపోతే దేవుడు ఎవడో నీకు తెలియదు. నీవు ఎవరో నువ్వు తెలుసుకో అని చెప్పటానికి కారణం ఇదే. నిన్ను నీవు తెలుసుకొన్నాక గురువు అంటే ఇట్టివాడా అని నీకు తెలుస్తుంది. నీలో హెచ్చుతగ్గులు తగ్గటానికి నీకు గురువు అంటే బాగా ఇష్టం అనుకోండి ఈ లోకం అంతా గురువుగానే చూడండి. మీ అమ్మాయి అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి ఈ లోకం అంతా మీ అమ్మాయిగానే చూడండి అప్పడు మీకు హెచ్చుతగ్గులు రావు. మనస్సు అణగటానికి చెప్పే ప్రక్రియ ఇది. అణిగిన మనస్సుకుగాని ఆత్మజ్ఞానం కలుగదు. నీవు ఎప్పటికైనా మోక్షం అనేది నీ హృదయంలోనే పొందాలి. ఉన్నదంతా హృదయంలోనే ఉంది బయట ఏమీలేదు అని గుర్తింపచేసేవాడే గురువు. మీరు దేహము అనుకొన్నా మీరు ఆత్మే, మీరు మనస్సు అనుకొన్నా మీరు ఆత్మే. మీరు ఆత్మే అని తెలియటానికి తలుపులు వేసుకొని, లోపల గెడలు వేసుకొని, ముక్కు మూసుకొని కూర్చోవాలా?


# రమణ భాస్కర

ఫారం 4 (రూలు 8)

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలము | : | **పాలకొల్లు** |
| 2. | ప్రచురణ కాలము | : | **పక్ష పత్రిక** |
| 3. | ప్రచురణ కర్తపేరు | : | **పి.ఎస్. రామరాజు** |
| 4. | భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| 5. | చిరునామా | : | **లక్ష్మీ మోడరన్ రైస్‌మిల్ ఉల్లంపర్రు - పాలకొల్లు** |
| 6. | పబ్లిషర్ భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| | చిరునామా | : | **పాలకొల్లు** |
| 7. | సంపాదకుడు భారతీయుడా? కాదా? | : | **భారతీయుడు** |
| 8. | పత్రిక యాజమాన్యం | : | **పి.ఎస్. రామరాజు పబ్లిషర్ & ఎడిటర్** |

## పాలకొల్లులో సౌరయాగము

పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామివారి ఆలయం (పెద్దగోపురం)లో రాజరాజేశ్వరీ జ్యోతిష, స్మార్త విద్యా పీఠం నిర్వహణలో ఫిబ్రవరి 11 నుండి 17 వరకు పూర్ణాహుతి నిర్వహించారు. మాఘ మాసంలో సామూహిక సూర్య నమస్కారములు, సౌర హోమములు వలన విశ్వ కల్యాణమునకు ప్రజలందరికి ఆరోగ్య, సమృద్ధి లభించునని ధూళిపాల శివరామ శర్మ తెలిపారు. యోగ బ్రహ్మ సువర్ణ హస్త ఘంటాకంకణ సన్మాన గ్రహీత కొండూరి రామ సుబ్రహ్మణ్యం వారి సోదరులు శ్రీనివాసు శర్మ అత్యంత వైభవంగా మహాసౌరయాగాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీ అల్లు వెంకట సత్యనారాయణ, ఆడిటర్ పి. లక్ష్మీనారాయణ, బి.వి.ఆర్. మోహన్ గుప్త, అన్నం మృత్యుంజయరావు, గుడిమెట్ల వెంకట రంగమోహన్, నందమూరి వెంకటేశ్వరరావు, పి. సూర్యభాస్కరరావు, కొప్ప సత్యనారాయణ, కారుమూరి శ్రీరాములు, మాటూరి నారాయణమూర్తి, కుటుంబం సర్రాజు, పి. రామచంద్రరావు, నాళం బాపిరాజు సతీ సమేతంగా ఈ యాగ పూజా కార్యక్రమాల్ని వారంరోజులు వంతులవారీగా నిర్వహించారు.



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

REGISTERED NEWS PAPER

RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000




To

A. Lakshmi
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278